
సాక్షి
పశ్చిమగోదావరి
శుక్రవారం ౹ 4 ౹ అక్టోబర్ ౹ 2024



ఆలోచనలతో ఆవిష్కరణలు

వినూత్న ఆలోచనలు ఎదుగుదలకు దోహదపడతాయని తాడేపల్లిగూడెంలోని ఏపీ నిట్‌లో జరిగిన కార్యక్రమంలో వక్తలు అన్నారు. 8లో ▸



పూత నిలిస్తేనే లాభాలు

మెట్ట ప్రాంతంలో జీడిమామిడి తోటలు పూత దశలో ఉన్నాయి. ఈ సమయంలో తగిన జాగ్రత్తలు తీసుకోవాలని ఉద్యాన అధికారులు సూచిస్తున్నారు. 8లో ▸



నేటినుంచి బాస్కెట్‌బాల్ పోటీలు

ఏలూరులో రాష్ట్రస్థాయి పురుషుల బాస్కెట్‌బాల్ పోటీలు శుక్రవారం నుంచి ప్రారంభం కానున్నాయి. 14 జట్లు పాల్గొంటాయి. 8లో ▸

న్యూస్‌రీల్

ఉత్తమ పంచాయతీగా కొత్త పట్టిసీమ



ఢిల్లీలో స్వచ్ఛభారత్ దివస్ కార్యక్రమంలో మాట్లాడుతున్న సర్పంచ్ విజయదుర్గ

పోలవరం రూరల్: పోలవరం మండలం కొత్త పట్టిసీమ పంచాయతీ స్వచ్ఛభారత్ దివస్ కార్యక్రమంలో ఉత్తమ పంచాయతీగా ఎంపికైంది. గాంధీ జయంతి సందర్భంగా బుధవారం ఢిల్లీలో ప్రధాని మోదీ అధ్యక్షతన జరిగిన స్వచ్ఛభారత్ దివస్ కార్యక్రమంలో కొత్త పట్టిసీమ సర్పంచ్ మైగాపుల విజయదుర్గ పాల్గొన్నారు. పంచాయతీ పరిధిలో పారిశుద్ధ్య నిర్వహణ పనులపై వివరించారు. రాష్ట్రంలో 8 పంచాయతీలు ఈ కార్యక్రమానికి ఎంపిక కాగా వీటిలో కొత్త పట్టిసీమ ఒకటి. ఉత్తమ పంచాయతీగా ఎంపిక కావడంపై సర్పంచ్ విజయదుర్గకు పలువురు అభినందనలు తెలిపారు.

మూడు వృద్ధాప్య పింఛన్లు నిలుపుదల

సాక్షి టాస్క్‌ఫోర్స్: దెందులూరు మండలం సోమవరప్పాడు గ్రామంలో మూడు వృద్ధాప్య పింఛన్లను అధికారులు నిలుపుదల చేశారు. వృద్ధులు వేమూరి బసవపున్నయ్య, వేమూరి సత్యనారాయణ, వేమూరి ఉదయ భాస్కరరావులు ప్రతినెలా అందుకుంటున్న సామాజిక పింఛన్‌ను అక్టోబర్‌లో నిలుపుదల చేయగా గ్రామ కార్యదర్శిని నిలదీశారు. గ్రామంలోని కొందరు నాయకులు నిలుపుదల చేయమని చెప్పారని కార్యదర్శి సమాధానమిచ్చారని దీంతో గురువారం ఏలూరులో కలెక్టర్ కె.వెట్రిసెల్వి ని కలిసి ఫిర్యాదు చేసినట్టు బాధితులు తెలిపారు. పింఛన్ల నిలుపుదలతో తమ కుటుంబాలు ఇబ్బంది పడతాయని, పునరుద్ధరించాలని కలెక్టర్‌ను కోరామన్నారు.

5 నుంచి టెట్ పరీక్షలు

భీమవరం: జిల్లాలో ఏపీ టీచర్ ఎలిజిబిలిటీ టెస్ట్ (ఏపీటెట్)కు పరీక్షలు ఈనెల 5వ తేదీ ప్రారంభం కానున్నాయని, అభ్యర్థులు నిబంధనలు తప్పనిసరిగా పాటించాలని డీఈఓ జి.నాగమణి గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ నెల 5,6,7,13,19,20 తేదీల్లో భీమవరం డీఎన్నార్, తాడేపల్లిగూడెం శ్రీవాసవి ఇంజినీరింగ్ కళాశాలల్లో పరీక్షలు నిర్వహిస్తారన్నారు. అభ్యర్థులు పరీక్షకు ఒక్క నిమిషం ఆలస్యమైనా కేంద్రంలోకి అనుమతించరని స్పష్టం చేశారు. పరీక్షా కేంద్రంలోకి సెల్‌ఫోన్లు, ల్యాప్‌టాప్, టాబ్లెట్‌లు, కెమెరాలు, ఇయర్‌ఫోన్స్, స్మార్ట్‌వాచ్, బ్లూటూత్ వంటి ఎలక్ట్రానిక్ వస్తువులు తీసుకువెళ్లరాదన్నారు.

ఆన్‌లైన్‌లో దరఖాస్తుల స్వీకరణ



ప్రక్రియను పరిశీలిస్తున్న ప్రిన్సిపల్ సెక్రటరీ ముఖేష్‌కుమార్ మీనా

ఏలూరు టౌన్: జిల్లాలో నూతన ఎక్సైజ్ పాలసీలో మద్యం షాపుల ఏర్పాటుకు ఆన్‌లైన్ దరఖాస్తుల ప్రక్రియను ఏలూరులో ఎక్సైజ్ కార్యాలయంలో గురువారం రాష్ట్ర ఎక్సైజ్ శాఖ ప్రిన్సిపల్ కార్యదర్శి ముఖేష్ కుమార్ మీనా పరిశీలించారు. ఈ సందర్భంగా ఆన్‌లైన్ ద్వారా మద్యం షాపుల ఏర్పాటుకు ఎన్ని దరఖాస్తులు అందాయని అధికారులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం మద్యం డిపోను, మద్యం నిల్వలను పరిశీలించారు. ప్రైవేట్ మద్యం షాపులు ఏర్పాటుచేసే వరకూ ప్రభుత్వ మద్యం దుకాణాల ద్వారా ఏ మేరకు మద్యాన్ని సరఫరా చేయగలమని అడిగి తెలుసుకున్నారు.

బాలికపై అసభ్య ప్రవర్తన.. డ్రాయింగ్ టీచర్ సస్పెన్షన్

బుట్టాయగూడెం: బుట్టాయగూడెం శివారు బూసరాజుపల్లి సమీపంలోని ఏపీ గురుకుల బాలికల పాఠశాలలో బాలిక పట్ల అసభ్యంగా ప్రవర్తించిన డ్రాయింగ్ ఉపాధ్యాయుడు మురళీకృష్ణను జాయింట్ కలెక్టర్, ఐటీడీఏ ఇన్‌చార్జి పీఓ ధాత్రిరెడ్డి సస్పెండ్ చేసినట్టు కేఆర్‌పురం ఐటీడీఏ డిప్యూటీ డైరెక్టర్, ఏపీఓ పీవీఎస్ నాయుడు తెలిపారు. గురువారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ అవుట్‌సోర్సింగ్‌లో పని చేస్తున్న డ్రాయింగ్ టీచర్‌ను సస్పెండ్ చేయడంతో పాటు ఉద్యోగం నుంచి రిమూవల్ కోసం ఏపీ గురుకులానికి సిఫార్సు చేశామన్నారు. అలాగే పాఠశాల ప్రిన్సిపాల్‌ను సరెండర్ చేసినట్టు చెప్పారు. ఆమె స్థానంలో అదే పాఠశాలలో పనిచేస్తున్న వైస్ ప్రిన్సిపాల్‌ను ఇన్‌చార్జి ప్రిన్సిపాల్‌గా బాధ్యతలు అప్పగించినట్టు చెప్పారు.

ప్రజలకు అండగా నిలుద్దాం

దిశానిర్దేశం
- విలువలతో కూడిన రాజకీయాలు చేద్దాం
- వచ్చేది మన ప్రభుత్వమే
- ఉమ్మడి జిల్లా నేతలతో భేటీలో వైఎస్సార్‌సీపీ అధినేత వైఎస్ జగన్
- సమావేశానికి జెడ్పీటీసీలు పెద్ద సంఖ్యలో హాజరు
- ఏలూరు కార్పొరేటర్లు, నగర నేతలతో ప్రత్యేక సమావేశం
- మాజీ మంత్రులు కొట్టు, కారుమూరి, జిల్లా అధ్యక్షులు ముదునూరి, దూలంతో పాటు మాజీ ఎమ్మెల్యేల హాజరు





వైఎస్సార్‌సీపీ అధినేత జగన్‌ను కలిసిన కారుమూరి నాగేశ్వరరావు, దూలం నాగేశ్వరరావు, కారుమూరి సునీల్‌కుమార్, మామిళ్లపల్లి జయప్రకాష్, తెల్లం బాలరాజు, జెడ్పీటీసీలు

సాక్షి ప్రతినిధి, ఏలూరు: కష్టాల్లో ప్రజలకు తోడుగా ఉండి.. అండగా నిలవండి.. విలువలతో కూడిన రాజకీయాలే చేద్దాం.. అబద్ధాలతో ప్రజలను మోసగించే అడ్డదారులు మనకు వద్దు.. వచ్చేది మళ్లీ మన ప్రభుత్వమే.. ఎవరూ అధైర్యపడవద్దు అని వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి శ్రేణులకు పిలుపునిచ్చారు. గురువారం తాడేపల్లిలోని క్యాంపు కార్యాలయంలో ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా మాజీ ఎమ్మెల్యేలు, సమన్వయకర్తలు, పార్లమెంట్ ఇన్‌చార్జులు, జెడ్పీటీసీలు, ముఖ్య నేతలు, కార్పొరేటర్లతో ఆయన సమావేశం నిర్వహించారు. ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లావ్యాప్తంగా పార్టీ శ్రేణులు పెద్ద సంఖ్యలో సమావేశానికి హాజరయ్యారు. ఈ సందర్భంగా శ్రేణులనుద్దేశించి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మాట్లాడుతూ రాజకీయాల్లో విశ్వసనీయత ఉండాలని, చెప్పిన మాట తప్పనిసరిగా నెరవేర్చేదై ఉండాలని, ప్రజల కష్టసుఖాల్లో అండగా నిలవాలని సూచించారు. అబద్ధాలు చెప్పడంలో చంద్రబాబు ఆయనకు ఆయనే సాటి అని, ఆయనతో పోటీపడి అసత్య హామీలు మనం ఇవ్వలేకపోయామని చెప్పారు. ఇసుక, మద్యం పెద్ద స్కామ్ అని గతంలో ఇసుక ద్వారా ప్రభుత్వానికి ఆదాయమైనా వచ్చేదని ఇప్పుడు అది కూడా లేదన్నారు.

మద్యం.. పెద్ద కుంభకోణం

రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం వచ్చాక ఒక్క హామీ కూడా అమలు చేయలేదని, ఒక్క పథకం కూడా ప్రజలకు అందలేదని జగన్ అన్నారు. మద్యం కూడా పెద్ద స్కామ్ అని టీడీపీ నేతలకు లబ్ధి చేకూర్చడానికే ఇవన్నీ చేస్తున్నారు తప్ప ప్రజలకు మేలు చేసే కార్యక్రమాలు చేయడం లేదన్నారు. ప్రభుత్వ వ్యతిరేక విధానాలు ప్రజల్లోకి తీసుకువెళ్లాలని, కష్టాల్లో అండగా నిలబడాలని, కేసులకు ఎవరూ భయపడవద్దని జగన్ సూచించారు. వచ్చేది మన ప్రభుత్వమేనని, రాష్ట్రంలో ప్రతిఒక్కరికి తప్పనిసరిగా మంచి చేస్తామని చెప్పారు. గత ఐదేళ్ల పాలనలో అన్ని హామీలను అమలు చేయడంతో పాటు ప్రతిఒక్కరికీ సంక్షేమ పథకాలను అందించామని, ఈ రోజుకి మనం గర్వంగా అది చెప్పుకోవచ్చని జగన్‌మోహన్‌రెడ్డి అన్నారు. ఏలూరు, పశ్చిమగోదావరి జిల్లాల పార్టీ అధ్యక్షులు దూలం నాగేశ్వరరావు, ముదునూరి ప్రసాదరాజు, మాజీ మంత్రులు కొట్టు సత్యనారాయణ, కారుమూరి నాగేశ్వరరావు, పార్లమెంట్ ఇన్‌చార్జులు కారుమూరి సునీల్‌కుమార్, గూడూరి ఉమాబాల, మాజీ ఎమ్మెల్యేలు పుప్పాల వాసుబాబు, తెల్లం బాలరాజు, జి.శ్రీనివాసనాయుడు, తలారి వెంకట్రావు, ఉండి, చింతలపూడి, ఏలూరు, పాలకొల్లు సమన్వయకర్తలు పీవీఎల్ నర్సింహరాజు, కంభం విజయరాజు, మామిళ్లపల్లి జయప్రకాష్, గుడాల గోపి, పార్టీ నేతలు నౌడు వెంకటరమణ, పిల్లంగోళ్ల శ్రీలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

జెడ్పీటీసీల్లో జోష్

జెడ్పీటీసీ చైర్‌పర్సన్ గంటా పద్మశ్రీ టీడీపీలో చేరిన క్రమంలో పార్టీ జెడ్పీటీసీలు పూర్తిస్థాయిలో సమావేశానికి హాజరయ్యారు. అన్ని నియోజకవర్గాల నుంచి జెడ్పీటీసీలు హాజరై సమావేశం అనంతరం పార్టీ అధ్యక్షుడు జగన్‌తో సెల్ఫీలు దిగారు. అలాగే ఏలూరు నగర నేతలతోనూ ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఏలూరు నగర నియోజకవర్గ నూతన సమన్వయకర్తగా మామిళ్లపల్లి జయప్రకాష్‌ను నియమించారు. ఈ క్రమంలో మొదటి సమావేశంలో పార్టీ అధ్యక్షుడు పాల్గొన్న క్రమంలో కార్పొరేటర్లు, ముఖ్య నాయకులు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు.

మద్యంతర గందరగోళం

- జిల్లాలో 175 వైన్ షాపులు
- ఒక్కో చోట ఎక్కువ.. మరికొన్ని చోట్ల తక్కువ దుకాణాలు
- ఈనెల 9 వరకు దరఖాస్తుల స్వీకరణ
- 11న లాటరీ పద్ధతిలో కేటాయింపు



భీమవరం: రాష్ట్ర ప్రభుత్వం నూతనంగా తీసుకువచ్చిన కొత్త మద్యం పాలసీ గందరగోళంగా మారింది. గత ప్రభుత్వం దశల వారీ మద్యనిషేధంలో భాగంగా విచ్చలవిడి మద్యం విక్రయాలను అరికట్టడానికి సర్కారీ మద్యం షాపులను ఏర్పాటుచేసి నిర్ణీత సమయాల్లో విక్రయాలు చేపట్టింది. అయితే సార్వత్రిక ఎన్నికల సమయంలో నాణ్యమైన మద్యం తక్కువ ధరకే విక్రయిస్తామని అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం ప్రైవేట్ వ్యక్తులకు మద్యం షాపులు ఇవ్వడానికి నిర్ణయించింది. దీనిలో భాగంగా జిల్లాలోని 5 మున్సిపాల్టీలు, ఒక నగర పంచాయతీ, 20 మండలాల్లోని 6 ఎక్సైజ్ స్టేషన్ల పరిధిలో 175 మద్యం దుకాణాల ఏర్పాటుకు అనుమతించింది.

నిర్దిష్ట విధానం లేకుండా..

మండలాలు, పట్టణాల్లో షాపుల కేటాయింపునకు నిర్దిష్టమైన విధానం లేకుండా ఓ మండలానికి తక్కువ, మరో మండలానికి ఎక్కువ షాపులు కేటాయించడంతో గందరగోళంగా మారింది. ఈ కేటాయింపులపై ప్రొహిబిషన్, ఎక్సైజ్ అధికారులు తలలు పట్టుకుంటున్నారు. భీమవరం పట్టణానికి సమీపంలో ఉన్న భీమవరం మండలంలో 8, కాళ్ల మండలంలో 9 షాపులు కేటాయించగా పక్కనే ఉన్న ఉండి మండలంలో కేవలం 4 షాపులు మాత్రమే కేటాయించడం పరిస్థితికి అద్దం పడుతోంది. మద్యం దుకాణాలకు బుధవారం నుంచి దరఖాస్తుల స్వీకరణ ప్రారంభించగా ఈనెల 9 వరకు గడువు ఉంది. దరఖాస్తుల పరిశీలన అనంతరం ఈనెల 11న భీమవరం నిర్మలాదేవి ఫంక్షన్ హాల్లో లాటరీ నిర్వహించి దుకాణాలు కేటాయిస్తారు.

మద్యం దుకాణాల కేటాయింపు

పట్టణం/మండలం	దుకాణాలు	పట్టణం/మండలం	దుకాణాలు	పట్టణం/మండలం	దుకాణాలు
భీమవరం పట్టణం	24	నరసాపురం పట్టణం	05	పెంటపాడు	08
భీమవరం రూరల్	08	నరసాపురం రూరల్	09	తాడేపల్లిగూడెం పట్టణం	11
ఆకివీడు పట్టణం	05	యలమంచిలి	05	తాడేపల్లిగూడెం	
ఆకివీడు రూరల్	05	ఆచంట	04	రూరల్ మండలం	06
కాళ్ల	09	పాలకొల్లు పట్టణం	07	ఇరగవరం	04
ఉండి	04	పాలకొల్లు రూరల్	04	పెనుగొండ	09
పాలకోడేరు	04	పోడూరు	04	పెనుమంట్ర	06
వీరవాసరం	04	అత్తిలి	07	తణుకు పట్టణం	09
మొగల్తూరు	05	గణపవరం	04	తణుకు రూరల్	05

మద్యం టెండర్

- టెండర్ వేసేందుకు భయపడుతున్న వ్యాపారులు
- ఏలూరు జిల్లాలో 32.. పశ్చిమలో 2 దరఖాస్తుల దాఖలు

ఏలూరు టౌన్: కూటమి ప్రభుత్వ హయాంలో నూతన మద్యం పాలసీ అమల్లోకి వచ్చింది. నూతన పాలసీ దెబ్బకు మద్యం దుకాణాలు ఏర్పాటు చేయాలని ఆశపడిన వ్యాపారులు బెంబేలెత్తిపోతున్నారు. ఓవైపు టెండర్ రేటు పెరగడంతో పాటు మరోవైపు కూటమి ప్రభుత్వంలో ఎమ్మెల్యేలు, నేతలు సిండికేట్ కావటంతో షాపుల ఏర్పాటుకు ఆశావహులు జంకుతున్నారు. మద్యం దుకాణాల లీజు ధరలు చెల్లించి ఇప్పుడున్న పరిస్థితుల్లో దుకాణాలు ఎలా నడపగలమని బేరీజు వేసుకుంటున్నారు. కూటమి నేతలకు తప్పనిసరిగా 25 శాతం వాటాలు ఇవ్వాలనే హెచ్చరికలతో టెండర్లు వేసేందుకు వెనుకడుగు వేస్తున్నారు. దీంతో ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాలో టెండర్ల దాఖలు ప్రక్రియ మందకొడిగా సాగుతోంది.

ఏలూరు జిల్లాలో.. మద్యం దుకాణాలకు చింతలపూడిలో 16, కైకలూరులో 7, నూజివీడు 8, ఏలూరు 1 దరఖాస్తు మాత్రమే దాఖలయ్యాయి. ఏలూరు, దెందులూరు, పోలవరం, నూజివీడు, ఉంగుటూరు తదితర ప్రాంతాల్లో ఒక దరఖాస్తు కూడా పడలేదు.

పశ్చిమలో.. పశ్చిమగోదావరి జిల్లాలో తణుకులో 2 దరఖాస్తులు వేసినట్టు అధికారులు తెలిపారు. ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాలో టెండర్ల ప్రక్రియ కొనసాగుతుందని ఎక్సైజ్ శాఖ డిప్యూటీ కమిషనర్ బి.శ్రీలత తెలిపారు.

రైల్వే ప్రాజెక్టులకు మోక్షమెప్పుడో?

పచ్చజెండా ఊపేనా..
- 23 ఏళ్లుగా నరసాపురం–కోటిపల్లి రైల్వే లైన్ పనులు
- మొక్కుబడిగా బడ్జెట్ కేటాయింపులు
- కలగా మారిన భద్రాచలం–కొవ్వూరు లైన్
- రద్దీకి తగ్గట్టు మరిన్ని ఎక్స్‌ప్రెస్‌లు అవసరం
- నేడు దక్షిణ మధ్య రైల్వే అధికారులతో ఎంపీల భేటీ



సాక్షి ప్రతినిధి, ఏలూరు: కీలక రైల్వే ప్రాజెక్టులు పెండింగ్.. కొన్ని బడ్జెట్‌ల్లో ప్రతిపాదనల ప్రస్తావన.. దశాబ్దాలుగా సాగుతున్న కొత్త రైల్వేలైన్ల పనులు.. ప్రయాణికుల రద్దీకి తగిన స్థాయిలో లేని రైళ్లు.. ఇది ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాలో పరిస్థితి. ఏటా కేంద్ర బడ్జెట్ సమయంలో జిల్లావాసులు ఆశగా ఎదురుచూడటం.. కేంద్రం మొండిచేయి చూపడం.. ఆ తర్వాత జరిగే రైల్వే అధికారుల భేటీలో ప్రజాప్రతినిధులు ప్రస్తావించడం.. పరిశీలిస్తామని చెప్పడం రివాజుగా మారింది. దశాబ్దాలుగా జిల్లాలో రెండు కీలకమైన రైల్వేలైన్ పనులు ముందుకు సాగని పరిస్థితి. కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత తొలిసారిగా దక్షిణ మధ్య రైల్వే పరిధిలోని ఎంపీలతో శుక్రవారం రైల్వే అధికారులు భేటీ కానున్నారు. ఏలూరు, నరసాపురం పార్లమెంట్ సభ్యులు సమావేశంలో పాల్గొననున్న క్రమంలో మళ్లీ జిల్లాలోని కీలక ప్రాజెక్టుపై చర్చ సాగుతుంది.

2001 నుంచి సాగుతూ..

నరసాపురం–కోటిపల్లి మధ్య 57 కిలోమీటర్ల రైల్వే లైన్ ఏర్పాటు చేస్తున్నట్టు 2001లో ప్రకటించారు. రూ.2,500 కోట్ల వ్యయంతో 2001లో ప్రారంభమైన పనులు ఇప్పటికీ నత్తనడకన సాగుతున్నాయి. ప్రతి బడ్జెట్‌లో అరకొర నిధులు మంజూరు చేయడమే ప్రధాన కారణం. రైల్వేలైన్ పనుల్లో భాగంగా తూర్పుగోదావరి జిల్లాలో రెండు చోట్ల, పశ్చిమగోదావరి జిల్లాలోని వశిష్ట గోదావరిపై చించినాడ వద్ద మూడు వంతెనలు నిర్మించాలి. ఇప్పటికి రూ.700 కోట్ల మేర పనులు మాత్రమే పూర్తయ్యాయి. 155.58 ఎకరాల భూసేకరణకు 80 ఎకరాలు మాత్రమే పూర్తయింది. 2014 నుంచి 2019 వరకు అప్పటి రాష్ట్ర ప్రభుత్వం ప్రాజెక్టులో 25 శాతం నిధులకుగాను ఒక్క రూపాయి కూడా మంజూరు చేయకపోవడం, పనులు నత్తనడకన సాగడానికి మరో కారణం. దీనిపై నరసాపురం ఎంపీ, కేంద్ర సహాయ మంత్రి భూపతిరాజు శ్రీనివాసవర్మ సమావేశంలో చర్చించి ప్రాజెక్టు వేగవంతం ఎంత మేరకు చేస్తారనే దానిపై చర్చ సాగుతుంది. ఈ ఏడాది బడ్జెట్‌లో నరసాపురం–మచిలీపట్నం మధ్య కొత్త రైల్వే లైన్ నిర్మాణానికి ప్రతిపాదనలు అందాయని, సర్వే చేయిస్తామని ప్రకటించారు. సర్వే ప్రతిపాదనలు రైల్వే బోర్డులోనే ఇంకా పెండింగ్‌లో ఉన్నాయి. ఈ ప్రాజెక్టు అయినా ఒక్క అడుగు ముందుకు పడుతుందా అనే దానిపై సర్వత్రా ఆసక్తి నెలకొంది.

రద్దీకి అనుగుణంగా..

ఏలూరు, పశ్చిమగోదావరిలోని ప్రధాన ప్రాంతాల్లో ప్రయాణికుల రద్దీకి అనుగుణంగా రైళ్లు నడవడం లేదు. ఏలూరు మీదుగా రోజూ రాకపోకలు సాగించే 70 రైళ్లు ఫుల్ రద్దీగా ఉంటున్నాయి. ఇక పగలు నరసాపురం–హైదరాబాద్‌కు రెండు, నరసాపురం నుంచి కాశీకి, నరసాపురం నుచి బెంగళూరు, ఏలూరు నుంచి విశాఖ, హైదరాబాద్‌కు విపరీతమైన డిమాండ్ ఉంది. ఈ క్రమంలో కొత్త రైళ్లు కేటాయించాలనే డిమాండ్ బలంగా ఉంది.

భద్రాచలం లైన్ పట్టాలెక్కేనా..

ఉమ్మడి పశ్చిమలో ఏజెన్సీ ప్రాంతానికి కీలకంగా ఉండే కొవ్వూరు–భద్రాచలం రైల్వే లైన్ ప్రతిపాదనను కొవ్వూరు–సత్తుపల్లిగా మార్చారు. వాస్తవానికి కొవ్వూరు–భద్రాచలం లైన్ పనుల కోసం 2013 బడ్జెట్‌లో రూ.923 కోట్లు కేటాయిస్తున్నట్టు కేంద్రం ప్రకటించింది. అయితే రైల్వే బోర్డులో ఆమోదం పొందకపోవడం, ప్రజాప్రతినిధులు పట్టించుకోకపోవడంతో ఒక్క రూపాయి నిధులు మంజూరు కాలేదు. ఏజెన్సీ ఉత్పత్తులు, బొగ్గు రవాణాకు ఈ రైల్వే లైన్ కీలకం కానుంది. ఈ క్రమంలో రెండేళ్ల క్రితం అప్పటి ఎంపీ కోటగిరి శ్రీధర్ కేంద్ర రైల్వే మంత్రి, ఉన్నతాధికారులను కలిసి పలుమార్లు వినతిపత్రాలు ఇచ్చి ప్రాజెక్టు ఆవశ్యకతను వివరించినా అధికారులు పట్టించుకోలేదు. తాజాగా మళ్లీ ఈ ప్రాజెక్టు తెరపైకి వచ్చింది.

పెండింగ్ కేసులపై ప్రత్యేక శ్రద్ధ

ఎస్పీ అద్నాన్ నయీం అస్మి



భీమవరం: పెండింగ్ కేసులపై ప్రత్యేక శ్రద్ధ వహించి త్వరితగతిన పరిష్కరించాలని, ప్రాపర్టీ నేరాల కట్టడి, నిందితుల గుర్తింపు, రికవరీలకు ప్రత్యేక బృందాలు ఏర్పాటు చేయాలని ఎస్పీ అద్నాన్ నయీం అస్మి అన్నారు. గురువారం జిల్లా పోలీసు కార్యాలయం నుంచి అధికారులతో జూమ్ కాన్ఫరెన్స్ ద్వారా ఆయన సమీక్షించారు. మహిళలపై జరుగుతున్న నేరాలు, పోక్సో కేసుల్లో దర్యాప్తు వేగవంతం చేసి బాధితులకు న్యాయం చేయాలని పోలీస్‌స్టేషన్ల పరిధిలో చట్టవ్యతిరేక, అసాంఘిక కార్యక్రమాలపై ప్రత్యేక నిఘా పెట్టాలని ఆదేశించారు. స్టేషన్ల వారీగా కేసుల వివరాలు, అరెస్టు, కేసు దర్యాప్తు తీరుతెన్నులపై అడిగి తెలుసుకున్నారు. అదృశ్యం కేసుల్లో అలసత్వం వహించవద్దన్నారు. రోడ్డు ప్రమాదాల నివారణకు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని, ప్రమాదాలు ఎక్కువగా జరిగే ప్రదేశాల్లో సైన్ బోర్డ్స్, బారికేడ్స్ ఏర్పాటు చేయాలన్నారు. గంజాయి వంటి నిషేధిత మాదక ద్రవ్యాల రవాణా, విక్రయించే వారిపై చర్యలు తీసుకోవాలన్నారు. అడిషనల్ ఎస్పీ (అడ్మిన్) వి.భీమారావు, స్పెషల్ బ్రాంచ్ సీఐ వి.పుల్లారావు, డీసీఆర్‌బీ సీఐ దేశంశెట్టి వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

రఘురామపై చర్యలు తీసుకోకపోవడం దారుణం



నిరసన తెలుపుతున్న మాలమహానాడు నాయకులు

తాడేపల్లిగూడెం (టీఓసీ): కాళ్ల మండలంలోని ఏలూరుపాడులో అంబేడ్కర్ ఫ్లెక్సీని ఉండి ఎమ్మెల్యే కనుమూరు రఘురామకృష్ణరాజు తొలగించిన ఘటనపై రాష్ట్రవ్యాప్తంగా ర్యాలీలు, ధర్నాలు చేస్తున్నా, పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదులు చేస్తున్నా ప్రభుత్వం పట్టించుకోకపోవడం దారుణమని మాలమహానాడు రాష్ట్ర అధ్యక్షుడు నల్లి రాజేష్ ఆందోళన వ్యక్తం చేశారు. పట్టణంలో మాలమహానాడు ఆధ్వర్యంలో గురువారం నిరసన తెలిపారు. రఘురామను ఎమ్మెల్యే పదవి నుంచి తొలగించాలని, పార్టీ నుంచి సస్పెండ్ చేయాలని, ఎస్సీ, ఎస్టీ అట్రాసిటి కేసు నమోదు చేయాలని, స్పీకర్ అనర్హత వేటు వేయాలని, లేనిపక్షంలో గవర్నర్ కలగుజేసుకోవాలని డిమాండ్ చేశారు. బాధ్యతాయుతమైన పదవిలో ఉన్న ఎమ్మెల్యే కులమతాలను రెచ్చగొట్టేలా విధ్వంసం సృష్టించే ప్రయత్నం చేస్తున్నారని ఆరోపించారు. నిరసనలో జిల్లా కార్యదర్శి గారపాటి నానాజీ, నల్లి రాఖీ బాయ్, కర్రి జోగయ్య, సరేళ్ల శ్రీను, తండా ఇసాక్ రాజు, నల్లి జయరాజు, మట్ట చంద్రశేఖర్, సరేళ్ల రఘు, మద్దాల రత్నంరాజు, భూపతి సరేష్ పాల్గొన్నారు.

ఇదేం దారిణం అంటూ ఆగ్రహం



ఏలూరు–సత్తుపల్లి రోడ్డుపై ధర్నా చేస్తున్న దృశ్యం

చింతలపూడి: చింతలపూడి నుంచి యర్రగుంటపల్లి వెళ్లే రహదారిని తక్షణం అభివృద్ధి చేయాలని సీపీఐ ఆధ్వర్యంలో గురువారం ఆందోళన చేపట్టారు. రేచర్ల బస్టాండ్ వద్ద ఏలూరు–సత్తుపల్లి ప్రధాన రహదారిపై రాస్తారోకో చేశారు. మండల సీపీఐ కార్యదర్శి కె.గురవయ్య మాట్లాడుతూ వర్షాలకు రోడ్డంతా గోతులతో నిండిపోయిందని, వర్షం నీటితో వాహన ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయన్నారు. గోతులతో ఇటుగా వెళ్లే పలు బస్సులు రద్దయ్యాయని అన్నారు. కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టి నాలుగు నెలలు కావస్తున్నా రోడ్ల అభివృద్ధిపై దృష్టి సారించడం లేదని మండిపడ్డారు.

క్లుప్తంగా

ఏలూరులో వైనాట్ 2వ షోరూమ్ ప్రారంభం



వై నాట్ షోరూమ్‌ను ప్రారంభిస్తున్న ఎల్‌జీ జనరల్ మేనేజర్ కృష్ణాజీ

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): నగరంలోని స్థానిక వసంతమహల్ సెంటర్‌లో వై నాట్ 2వ షోరూమ్‌ను గురువారం ఎల్‌జీ ఎలక్ట్రానిక్స్ సీనియర్ జనరల్ మేనేజర్ కరాటం వెంకట కృష్ణాజీ ప్రారంభించారు. వైనాట్ మేనేజింగ్ డైరెక్టర్ జుజ్జవరపు వెంకట రాయుడు మాట్లాడుతూ ఏలూరులో మరింత మంది ఖాతాదారులకు అందుబాటులో ఉండడం కోసం తమ 2వ షోరూమ్‌ను ప్రారంభించినట్లు చెప్పారు. ప్రారంభోసేల్ లక్కీపాట్ ద్వారా మిక్సర్ గ్రైండర్ బహుమతిగా పొందిన ఖాతాదారునికి ఎల్‌జీ జనరల్ మేనేజర్ కరాటం వెంకట కృష్ణాజీ చేతుల మీదుగా అందించారు. ఈ కార్యక్రమంలో ఎల్‌జీ బ్రాంచ్ మేనేజర్ కిషోర్, లాయిడ్ రీజనల్ మేనేజర్ హేమసుందర్, హేయర్ బ్రాంచ్ మేనేజర్ అరవింద్ శర్మ, సోనీ సీనియర్ మేనేజర్ భాస్కర్, శ్యామ్‌సంగ్ ఐఎఫ్‌బీ, బోష్, ఎంఐ, వివో కంపెనీల ఏరియా మేనేజర్లు పాల్గొన్నారు.

నేటినుంచి రాష్ట్రస్థాయి బాస్కెట్‌బాల్ పోటీలు

ఏలూరు రూరల్ : ఈ నెల 4, 5, 6 తేదీల్లో ఏలూరులో రాష్ట్రస్థాయి పురుషుల బాస్కెట్ బాల్ పోటీలు నిర్వహించనున్నట్లు నిర్వాహకుడు, సీనియర్ క్రీడాకారుడు అలీష చెప్పారు. జిల్లా బాస్కెట్‌బాల్ అసోసియేషన్ సహకారంతో మూడురోజుల పాటు ఫ్లడ్‌లైట్ల వెలుగులో పోటీలు జరుగుతాయన్నారు. ఇందుకోసం అన్ని ఏర్పాట్లు పూర్తి చేశామన్నారు. స్థానిక అల్లూరి సీతారామరాజు స్టేడియంలో సాయంత్రం 5 గంటలకు పోటీలు ప్రారంభమౌతాయని వివరించారు. అనంతపురం, గుంటూరు, విజయవాడ, మార్టేరు, భీమవరం తదితర ప్రాంతాల నుంచి సుమారు 14 జట్లు పాల్గొంటాయన్నారు. ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాల్లో నిలిచిన జట్లకు ట్రోఫీతో పాటు నగదు బహుమతి అందిస్తామన్నారు.

మనస్తాపంతో మహిళ ఆత్మహత్య

ఆకివీడు : భర్తకు, కుమారుడికి దూరంగా ఉంటున్నాననే మనస్తాపంతో ఓ మహిళ ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకున్న ఘటన గురువారం జరిగింది. స్థానిక పెద్దపల్లి వీధిలో నివసిస్తున్న ఖడ్గ నాగలక్ష్మి పెళ్లయి.. భర్త, కుమారుడు ఉన్నప్పటికీ.. గత కొంతకాలంగా వేరే వ్యక్తితో పరిచయం ఏర్పర్చుకొని కుటుంబానికి దూరంగా విజయవాడలో ఉంది. ఇటీవల ఆమె గ్రామానికి వచ్చి పెద్దపల్లి వీధిలో అద్దెకు ఉంటూ ఒంటరిగా జీవిస్తోంది. ఈ క్రమంలో కుటుంబానికి దూరంగా ఉన్నానని మనస్తాపంతో ఆత్మహత్యకు పాల్పడి ఉంటుందని స్థానికులు చెబుతున్నారు. సమాచారం అందుకున్న పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం తరలించారు. కేసు దర్యాప్తు చేస్తున్నారు.

మద్యం తరలిస్తున్న వ్యక్తి అరెస్ట్

ఏలూరు టౌన్ : మద్యం సీసాలను తరలిస్తున్న ఒక వ్యక్తిని ఎక్సైజ్ పోలీసులు అరెస్ట్ చేశారు. ఎక్సైజ్ అసిస్టెంట్ కమిషనర్ కేవీ నాగప్రభ కుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. గాంధీజీ జయంతి సందర్భంగా ఎక్సైజ్ పోలీసులు తనిఖీలు చేస్తుండగా భీమడోలు ఎక్సైజ్ పోలీసు స్టేషన్ పరిధిలోని గుండుగొలను వద్ద బొల్లం దుర్గారావు అనే వ్యక్తి 22 మద్యం సీసాలు తీసుకువెళుతూ పట్టుబడినట్లు చెప్పారు. పాండిచ్చేరి రాష్ట్రం నుంచి ఈ మద్యాన్ని అక్రమంగా తీసుకువచ్చినట్లుగా గుర్తించామన్నారు. అతనిపై కేసు నమోదు చేసి అరెస్ట్ చేశామని మద్యం సీసాలు స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు.

అమ్మా.. అభయములీయుమా

బాలా త్రిపుర సుందరీ దేవి.. అభయములు ప్రసాదించు తల్లీ అంటూ భక్తులు వేడుకున్నారు. దేవీ శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా తొలిరోజు గురువారం అమ్మవారు బాలాత్రిపుర సుందరీదేవి అలంకరణలో దర్శనమిచ్చారు. మనసు, బుద్ధి, చిత్తం అధీనంలో ఉన్న అమ్మవారిని దర్శించుకునేందుకు భక్తులు వేకువజామునుంచే ఆలయాల వద్ద బారులు తీరారు. – సాక్షి నెట్‌వర్క్



స్వర్ణ రజిత కవచాలంకరణలో భీమవరం మావుళ్లమ్మ తల్లి



తాడేపల్లిగూడెం (టీఓసీ): బాల త్రిపుర సుందరీ దేవిగా తాడేపల్లిగూడెం బలుసులమ్మ తల్లి



పెనుగొండ: ప్రత్యేక అలంకరణలో వాసవీ శాంతి ధాంలోని మరకత శిల వాసవీ మాత



తణుకు టౌన్ : స్వర్ణ కవచ అలంకరణలో దువ్వ దానేశ్వరి అమ్మవారు



పాలకొల్లు సెంట్రల్ : క్షీరారామలింగేశ్వరస్వామి ఆలయంలో బాలాత్రిపురసుందరి అలంకరణ

పూత నిలిస్తేనే లాభాలు

- జీడి మామిడి పూత దశలో జాగ్రత్తలు పాటించాలి
- ఉద్యాన శాఖ అధికారిణి ఎండీ షాఫియ ఫర్‌హీన్



మెట్ట ప్రాంతంలో పూత దశలో ఉన్న జీడి మామిడి తోట



జీడి తోటలో చెట్లకు టి దోమ సోకిన దృశ్యం

చింతలపూడి : మెట్ట ప్రాంతంలో జీడితోటలు విస్తరించి ఉన్నాయి. ప్రస్తుతం జీడి తోటలు పూత పూసే దశలో ఉన్నాయి. ఈ పరిస్థితుల్లో జీడిమామిడి రైతులు పూత దశ నుంచి జాగ్రత్తలు తీసుకుంటేనే లాభాలు సాధించగలరని ఉద్యాన శాఖ అధికారిణి ఎండీ షాఫియ ఫర్‌హీన్ అన్నారు. జీడిమామిడి సాగు సస్యరక్షణపై ఆమె రైతులకు సూచనలు చేశారు. సాధారణంగా జీడిమామిడిలో పూత అక్టోబర్, నవంబర్ నెలల్లో మొదలై జనవరి, ఫిబ్రవరి వరకు వస్తుంది. జీడిమామిడి చెట్లు పూతకు రావాలంటే సుమారు 25 రోజుల నుంచి 30 రోజులు పొడి వాతావరణం ఉండాలి. ఒకవేళ అక్టోబర్ నెల నుంచి నవంబర్ వరకు వర్షాలు పడినట్లు అయితే పూత ఆలస్యమై రాలిపోయే అవకాశం ఎక్కువగా ఉంటుంది. అలాగే తెగుళ్ల తీవ్రత కూడా ఎక్కువయ్యే అవకాశాలు ఉంటాయి.

వర్షా కాలంలో సిఫార్సు చేసిన ఎరువులు రెండు నుంచి మూడు సమ భాగాలుగా వేసుకోవాలి. ఐదేళ్ల పైబడిన చెట్టుకు యూరియ 1.5 కేజీలు, సూపర్ ఫాస్ఫేట్ 650 గ్రాములు, పొటాష్ 1 కేజీ వేసుకోవాలి. పూత దశలో మంచు ఎక్కువగా పడుతున్నప్పుడు పూత లోపల తేమ చేరి ఎండిన మగపూల వలన తామర పురుగులు లేదా తేయాకు దోమ ఉధృతి ఎక్కువయ్యే అవకాశాలు ఉంటాయి.

టి దోమ రసం పీల్చేస్తుంది

జీడిమామిడిలో పూత దశ అంటే అక్టోబర్ నవంబర్ మాసాల్లో టి దోమ మొదలవుతుంది. జనవరిలో ఎక్కువయ్యి లేత చిగుళ్ళు, పూత, పూత కాడలను, చిన్న కాయలను ఆశించి రసం పీల్చడం ప్రారంభిస్తాయి. రసం పీల్చినప్పుడు ఒక రకమైన పదార్థం వదలడం వల్ల కాయలపై, చిగుర్లపై గజ్జిలాంటి లక్షణాలు కనిపిస్తాయి. అంతేకాకుండా పూత, చిగుర్లపై చేసిన రంధ్రాల వలన ఫ్లవర్ బైట్ అనే తెగులు కూడా వ్యాప్తి చెందుతుంది.

దోమ నివారణకు..

దోమ నివారణకు చెట్లు చిగురించినప్పుడు మొదటి పిచికారీకి రైతులు ల్యాండా సైహాలో త్రిన్ 0.6 మిల్లీ లీటర్లు లీటరు నీటికి, లేదా అసిటామాప్రిడ్ 0.5 గ్రాములు లీటరు నీటికి కలిపి పిచికారీ చేయాలి. అలాగే పూత కొమ్మలు కనిపించినప్పుడు రెండు, మూడు వారాల తరువాత ఇమిడాక్లోప్రిడ్ 0.6 మి.లీ లీటరు నీటికి లేదా ప్రొఫెనోఫాస్ 1.5 మి.లీ, లీటర్ నీటికి కలిపి రెండోసారి పిచికారీ చేయాలి. కాయలు గోలీ సైజులో ఉన్నప్పుడు ల్యాండా సైహాలో త్రిన్ 0.6 మిల్లీ లీటర్లు లీటర్ నీటికి లేదా ప్రొఫెనోఫాస్ 1.5 మి.లీ, లీటర్ నీటికి కలిపి మూడోసారి పిచికారీ చేయాలి. వీటితో పాటు వేపనూనెను తగిన మోతాదులో కలిపి వాడటం వలన మంచి ఫలితాలు వస్తాయి.

బూడిద తెగులు నివారణకు..

పొడి వాతావరణం ఉన్నప్పుడు బూడిద తెగులు కూడ ఎక్కువగా పూతను నష్ట పరిచి పూత రాలిపోయేలా చేస్తుంది. బూడిద తెగులు వల్ల లేత చిగుళ్లను, పూతను ఆశించి ఎండిపోయేలా చేసి పంటను నష్టపరుస్తుంది. దీని నివారణకు సల్ఫర్ 3 గ్రాములు లీటర్ నీటికి కలిపి పిచికారీ చేయాలి. లేదా ట్రై డేమోర్ఫ్ 1.5 గ్రాములు లీటర్ నీటికి కలిపి పిచికారీ చేయాలి.

ఆకు, పూత, కాయమచ్చ తెగులు నివారణ ఇలా..

ఆకులపై చిన్న, చిన్న లేత ఆకుపచ్చ వర్ణంలో మచ్చలు ఏర్పడి క్రమేపీ మచ్చలు పెరుగుతూ మచ్చ మధ్య ఎండిపోయి చివరికి మొత్తం ఆకు ఎండి రాలిపోతుంది. పూత, పూత కాడలపై మచ్చలు వచ్చి పూత ఎండిపోయి రాలిపోతుంది. దీని నివారణకు రైతులు తొలుత తెగులు ఆశించిన కొమ్మలు తొలగించుకోవాలి. మంకోజెట్ 1 గ్రాము లీటరు నీటికి, లేదా కాపర్ ఆక్సీక్లోరైడ్ 3 గ్రాములు లీటర్ నీటికి, లేదా క్లోరో తాలోనిల్ 1 మిలీ లీటర్ నీటికి కలిపి పిచికారీ చేసుకోవాలి.



ఎండి షాఫియ ఫర్‌హీన్
ఉద్యానశాఖ అధికారిణి - చింతలపూడి

పెదమామిడిపల్లిలో అగ్నిప్రమాదం



అగ్నికి ఆహుతైన గృహోపకరణాలు

పాలకొల్లు అర్బన్ : పెదమామిడిపల్లిలో జరిగిన అగ్ని ప్రమాదంలో పరువు ఘటోత్కజుడు అనే వ్యక్తికి చెందిన రేకుల షెడ్డు గురువారం దగ్ధమయ్యింది. విద్యుత్ షార్ట్‌సర్క్యూట్ కారణంగా టీవీ పేలి ఈ ప్రమాదం చోటు చేసుకుందని భావిస్తున్నారు. ప్రమాదంలో సుమారు రూ.2 లక్షల విలువైన గృహపకరణాలు అగ్నికి ఆహుతయ్యాయి. ప్రమాదవార్త తెలియగానే పాలకొల్లు ఫైర్ ఆఫీసర్ వైవీ జానకిరామ్ ఘటనా స్థలానికి చేరుకుని మంటలను అదుపు చేశారు. సర్పంచ్ యాండ్ర లక్ష్మీకుమారి, ఉపసర్పంచ్ యాండ్ర గోపి బాధిత కుటుంబాన్ని పరామర్శించారు.

చేనేతలు సబ్సిడీలను వినియోగించుకోవాలి

పెనుగొండ: చేనేతలకు అనేక సదుపాయాలు అందుబాటులో ఉన్నాయని జిల్లా చేనేత జౌళి శాఖాధికారి ఏ అప్పారావు ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలో 19 చేనేత సహకార సంఘాలు ఉన్నాయని, పట్టు చేనేత సంఘాలు నమోదు కాలేదన్నారు. జిల్లాలో ఎటువంటి పట్టువస్త్రాలు ఉత్పత్తి కావడం లేదన్నారు. 90 శాతం సబ్సిడీతో మగ్గం, మగ్గం పనిముట్లు అందించడం జరుగుతుందని, సంఘాలకు దరఖాస్తులు అందించాలని కోరారు. 50 ఏళ్లు పైబడిన వారికి పింఛన్ల మంజూరుకు సిఫారసు చేయడం జరుగుతుందన్నారు. ప్రస్తుతం 2,852 మంది చేనేత పింఛన్లు తీసుకుంటున్నారని తెలిపారు. చేనేత వృత్తిదారులకు వివిధ బ్యాంకుల ద్వారా ముద్ర రుణాలు మంజూరు చేయించడం జరుగుతుందన్నారు. 100 యూనిట్ల లోపు వాడకంపై ఉచిత విద్యుత్ అందించడం జరుగుతుందన్నారు.

విద్యార్థిపై స్కూల్ యాజమాన్యం అనుచిత ప్రవర్తన

- భవానీ మాల వేసుకున్నాడని క్లాస్‌రూంలోకి రానీయకుండా అడ్డగింత
- వీహెచ్‌పీ ఆందోళన.. యాజమాన్యం క్షమాపణ



పాఠశాల వద్ద ఆందోళన చేస్తున్న వీహెచ్‌పీ నాయకులు

నరసాపురం: నరసాపురంలోని జె సికిలే స్కూల్ వద్ద గురువారం ఉద్రిక్తత నెలకొంది. పాఠశాలలో జరుగుతోన్న యూనిట్ పరీక్ష రాయడానికి యూనిఫాంకి బదులు భవానీ మాలధారణతో వచ్చాడని ఆరో తరగతి విద్యార్థి కె.చక్రవర్తిపై యాజమాన్యం అనుచితంగా ప్రవర్తించింది. తరగతి గదిలోకి రానీయకుండా, బయటే కూర్చోబెట్టింది. ఈ విషయం తెలిసిన విద్యార్థి తండ్రి విశ్వహిందూ పరిషత్ (వీహెచ్‌పీ) నేతలతో కలిసి పాఠశాల వద్ద ఆందోళన చేపట్టారు. పాఠశాల ఉపాధ్యాయులు, కరస్పాండెంట్ సికిలే పెర్సిపాల్‌తో వాగ్వాదానికి దిగారు. చివరకు యాజమాన్యం ఈ విషయంపై క్షమాపణ కోరి, విద్యార్థిని పరీక్ష రాయించడానికి తరగతి గదికి తీసుకెళ్లడంతో వివాదం సద్దుమణిగింది. వీహెచ్‌పీ నేతలు ఉలిసి నాగేంద్ర, కటికిరెడ్డి రవికుమార్ మాట్లాడుతూ తండ్రి వచ్చి విద్యార్థి చొక్కా మార్చినప్పటికీ యాజమాన్యం తొలుత ఒప్పుకోలేదన్నారు. దసరా సెలవులు ఇవ్వకుండా నిబంధనలకు విరుద్ధంగా పాఠశాల నడుపుతున్నారని విమర్శించారు. ఎంఈవో డి.పుష్పరాజ్యంకు దీనిపై వినతిపత్రమిచ్చారు. స్కూల్ కరస్పాండెంట్ పెర్సిపాల్ మాట్లాడుతూ సెంట్రల్ సిలబస్ అమలు చేస్తున్న పాఠశాల కావడంతో 2 రోజులు ఆలస్యంగా దసరా సెలవులు ఇస్తున్నామని చెప్పారు. విద్యార్థిని బయటకు పంపడం లాంటివి చేయలేదన్నారు.

వినూత్న ఆలోచనలతోనే నూతన ఆవిష్కరణలు



నిట్‌లో జరిగిన కార్యక్రమంలో మాట్లాడుతున్న అసోసియేట్ డీన్ వి.సందీప్

తాడేపల్లిగూడెం: వినూత్న ఆలోచనలు ఉంటే ఎదుగుదలకు దోహదం చేస్తుందని నిట్‌లో బుధవారం జరిగిన కార్యక్రమంలో వక్తలు పేర్కొన్నారు. ఐఈఈఈ వినూత్న ఆలోచనలు, నాణ్యమైన ఆచరణాత్మకమైన ఆవిష్కరణలుగా తీర్చిదిద్దుకోడానికి ఉపయోగపడుతుందని, ఆంధ్రా యూనివర్సిటీ కంప్యూటర్ సైన్సు ఇంజనీరింగ్ విభాగం ఆచార్యులు, ఐఈఈఈ వైజాగ్ బే సెక్షన్ వ్యవస్థాపక డైరెక్టర్ డాక్టర్ సదాశివుని లక్ష్మీనారాయణ అన్నారు. పవర్ ఎలక్ట్రానిక్స్, ఇండస్ట్రీ అప్లికేషన్స్, పవర్ అండ్ ఎనర్జీ విభాగాల సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించిన ఐఈఈఈ దినోత్సవంలో పలు విషయాలపై చర్చ సాగింది. అనుభవజ్ఞులైన ఆచార్యులు, నిపుణులైన ఇంజినీర్లు, శాస్త్రవేత్తలు సభ్యులుగా ఉన్న ఐఈఈఈ పరిశోధనల విషయంలో ఎదురయ్యే సమస్యలను వారితో నిరంతరం చర్చించి ఉత్తమమైన పరిశోధనలుగా మలుచుకోవచ్చన్నారు. పరిశోధక జర్నల్స్, మ్యాగజైన్స్ వంటి విషయాల్లో కూడా పరిశోధక విద్యార్థులకు మార్గదర్శనం చేస్తుందన్నారు. అసోసియేట్ డీన్ డాక్టర్ వి.సదీప్ మాట్లాడుతూ కొలువుల సాధనకు, సాంకేతిక నైపుణ్యాలే కీలకమన్నారు. ప్రస్తుత పోటీ ప్రపంచంలో రాణించాలంటే విద్యార్థులు ఆధునిక సాంకేతికతలపై పట్టు సాధించాలన్నారు. పరిశోధనల్లో కొత్త శిఖరాలను అధిరోహించేందుకు వచ్చిన అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. నిట్ ఆచార్యులు, బోధకులు ఎస్.కోడీశ్వరన్, శ్రీఫణికృష్ణ, ఆదిత్య శ్రీరామ్, గుమ్మల బాబు, బలరామ్ కుమార్, పరిశోధక విద్యార్థులు పాల్గొన్నారు.

8 నుంచి రాష్ట్రస్థాయి టెన్నిస్ పోటీలు



మాట్లాడుతున్న కాస్మో స్పోర్ట్స్ క్లబ్ అధ్యక్షుడు గాంధీరాజు

పాలకొల్లు సెంట్రల్: అక్టోబర్ 8, 9 తేదీల్లో పాలకొల్లులో రుద్రరాజు పద్మరాజు మెమోరియల్ రాష్ట్రస్థాయి టెన్నిస్ పోటీలు నిర్వహిస్తున్నామని కాస్మో స్పోర్ట్స్ కాంప్లెక్స్ అధ్యక్షుడు గొట్టుముక్కల గాంధీభగవాన్‌రాజు తెలిపారు. కాస్మో కాంప్లెక్స్, టౌన్ హాల్ ఆధ్వర్యంలో ఈ పోటీలు నిర్వహిస్తున్నట్లు ఆయన చెప్పారు. స్థానిక కాస్మో క్లబ్ హాలులో గురువారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఈ వివరాలు వెల్లడించారు. ఈ పోటీల్లో 8, 10, 12, 14 విభాగాల్లో బాలబాలికలకు సింగిల్, డబుల్స్ విభాగాల్లో పోటీలు నిర్వహించనున్నట్లు చెప్పారు. నవంబర్‌లో జాతీయ స్థాయి టోర్నీ నిర్వహించనున్నామని ఈ సందర్భంగా తెలిపారు. దానికి సంబంధించి తేదీలు త్వరలో ప్రకటిస్తామని చెప్పారు. సమావేశంలో ఆర్.రమేష్‌బాబు, వీవీ సోమరాజు, ఆర్.సత్యనారాయణరాజు, బూన్ రాజు, టోర్నమెంట్ ఆర్గనైజర్లు పాల్గొన్నారు.

చోరీ ఘటనపై ఫిర్యాదు

జంగారెడ్డిగూడెం: ఆగస్టులో చోరీ జరగగా.. అక్టోబరులో పోలీసులకు ఫిర్యాదు చేసిన ఘటన జంగారెడ్డిగూడెంలో గురువారం జరిగింది. ఈ ఘటనకు సంబంధించి ఏఎస్ఐ వై.మంగయ్య తెలిపిన వివరాలిలా ఉన్నాయి. పట్టణానికి చెందిన చావలి వెంకటేశ్వర్లు కుటుంబసభ్యులతో కలసి తన బాబాయి పెదకార్యానికి హాజరయ్యేందుకు విజయవాడకు వెళ్లారు. తిరిగి 21న ఇంటికి వచ్చేసరికి.. సింహద్వారం పగులగొట్టి.. చోరీ జరిగిన విషయాన్ని గుర్తించారు. బీరువాలో ఉంచిన బంగారు వస్తువులు చోరీకి గురవడంతో దిక్కుతోచని పరిస్థితిలో ఉండిపోయారు. ఈ ఘటనపై అప్పట్లో పోలీసులకు ఫిర్యాదు చేయని వెంకటేశ్వర్లు.. కుటుంబసభ్యుల సలహా మేరకు గురువారం పోలీసులను ఆశ్రయించాడు.

లారీ ఢీకొని కార్మికురాలు మృతి

భీమవరం: ద్విచక్ర వాహనాన్ని లారీ ఢీకొట్టడంతో పారిశుద్ధ్య కార్మికురాలు మృతిచెందిన ఘటన గురువారం భీమవరంలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. బంగారు రమణమ్మ (56) గత 30 ఏళ్లుగా భీమవరం పురపాలక సంఘంలో పారిశుద్ధ్య కార్మికురాలిగా పనిచేస్తోంది. గురువారం ఉదయం మస్టర్ కార్యాలయానికి తన కుమారుడు శివకుమార్‌తో కలిసి బైక్‌పై వెళుతోంది. భీమవరంలోని రైల్వే ఓవర్ బ్రిడ్జిపై పాలకొల్లు నుంచి భీమవరం వైపు వెళుతున్న లారీ వీరి బైక్‌ని ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో కుమారుడు, ఆమె రోడ్డుపై పడిపోగా.. లారీ చక్రాలు రమణమ్మ ఎడమ కాలిపై నుంచి వెళ్లడంతో కాలు నుజ్జయ్యింది. మెరుగైన చికిత్స నిమిత్తం భీమవరం నుంచి విజయవాడ తీసుకువెళ్తుండగా మార్గంలోనే ప్రాణాలు కోల్పోయింది. ఆమె కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు ఏఎస్సై బి.రామకృష్ణ కేసు దర్యాప్తు చేస్తున్నారు.

మద్యం మత్తులో.. కలుపు మందు తాగి..

ఏలూరు టౌన్: మద్యం మత్తులో కలుపు మందు తాగిన వ్యక్తి చికిత్స పొందుతూ గురువారం మృతిచెందాడు. ఈ ఘటనకు సంబంధించి పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. ఆచంట గ్రామం చినపేటకు బోడా నాగరాజు (30) నిత్యం మద్యం అధికంగా తాగుతుంటాడు. ఈ నెల రెండో తేదీన మద్యం మత్తులో పొలంలో వాడే కలుపు మందు తాగేశాడు. అతను తీవ్ర అస్వస్థతకు గురవడాన్ని గమనించిన కుటుంబసభ్యులు వెంటనే ఆస్పత్రికి తరలించారు. ఏలూరు ప్రభుత్వాస్పత్రిలో చికిత్స అందించినా ఫలితం లేకపోయిందని గురువారం అతను ప్రాణాలు కోల్పోయాడు. ఆచంట పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

క్లుప్తంగా

డీపీటీఓను కలిసిన వెల్ఫేర్ అసోసియేషన్ నాయకులు



డీపీటీఓను కలిసిన నాయకులు

తణుకు: ఆంధ్రప్రదేశ్ రోడ్డు రవాణా సంస్థ బహుజన ఎంప్లాయీస్ వెల్ఫేర్ అసోసియేషన్ నాయకులు గురువారం ఎన్టీఆర్ జిల్లా ప్రజా రవాణా అధికారి (డీపీటీఓ) ఎంవై దానంను మర్యాదపూర్వకంగా కలిశారు. అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చిర్రా శాంసన్, కోశాధికారి బీవీవీఎస్ నారాయణ, జిల్లా అధ్యక్షుడు కండెల్లి గాంధీ, ఎమ్మార్పీఎస్ఎస్ జిల్లా అధ్యక్షులు చిర్రా బ్రహ్మయ్య తదితరులు దానంను సత్కరించి అభినందించారు.

పేద కుటుంబానికి ఆర్థిక సాయం



ఆర్థిక సాయం అందిస్తున్న అందజేస్తున్న ట్రస్టీ

తాడేపల్లిగూడెం (టీఓసీ): గుండె సంబంధిత వ్యాధితో బాధపడుతున్న, పట్టణంలోని పేద కుటుంబానికి చెందిన హర్ష సాయి కృష్ణ (18 నెలలు)కు గురువారం గ్లోబల్ సపోర్టు ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో తల్లిదండ్రులకు దాత సహకారంతో రూ.10 వేలు అందజేశారు. వైఎస్సార్ సీపీ నాయకులు, ట్రస్టీ చెన్నా జనార్దనరావు మాట్లాడుతూ నిరుపేద కుటుంబానికి తమ వంతు సాయం అందించినట్టు చెప్పారు.

షుగర్‌వ్యాధి పట్ల అప్రమత్తంగా ఉండాలి



షుగర్‌వ్యాధి రక్త పరీక్షల శిబిరం

తాడేపల్లిగూడెం (టీఓసీ): షుగర్ వ్యాధి పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని లయన్ పేరిచర్ల మురళీకృష్ణంరాజు అన్నారు. స్థానిక ఆర్ అండ్‌బీ గెస్ట్ హౌస్ ఆవరణలో డైమండ్స్ క్లబ్ ఆధ్వర్యంలో గురువారం ఉచిత షుగర్ రక్త పరీక్షల శిబిరం, అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఆరోగ్య పరిరక్షణకు నడక, యోగ, వ్యాయామం తప్పక చేయాలని సూచించారు. కంచర్ల లక్ష్మీనరసింహ, నార్ని వెంకట కృష్ణారావు, సతీష్, మధుబాబు, అపర్ణ ప్రసాద్, డి.ముఖర్జీ, ఆంజనేయస్వామి, బెజవాడ రాంబాబు, వాకర్స్, షెటిల్ ప్లేయర్స్ హాజరయ్యారు.

మెడిసిన్‌తో మెరిసిన సాహితి



చీలి సాహితి

తణుకు అర్బన్: తణుకు జెడ్పీ బాయ్స్ హైస్కూలు పూర్వ విద్యార్థిని చీలి సాహితి ఇటీవల ప్రకటించిన నీట్ ఎంట్రన్స్‌లో ఆల్ ఇండియా 33,079, స్టేట్‌లో 850వ ర్యాంకు సాధించింది. పాండిచ్చేరి కరైకల్‌లోని జిప్‌మర్ మెడికల్ కళాశాలలో ఉచిత మెడిసిన్ సీటు దక్కించుకుంది. పాఠశాలకు వచ్చిన సాహితిని హెచ్ఎం కె.పద్మావతి, ఉపాధ్యాయులు ఘనంగా సత్కరించారు. తండ్రి చీలి రాజు జెడ్పీ బాయ్స్ హైస్కూల్లో అసోసియేట్ ఎన్‌సీసీ ఆఫీసర్‌గా కాగా, తల్లి చెక్కా శైలజ తేతలి పాఠశాల-2లో ఉపాధ్యాయురాలు. సాహితి సోదరి హాసిని ఇంటర్మీడియేట్, సోదరుడు వర్షిత్ 9వ తరగతి చదువుతున్నారు.

సోలార్ విద్యుత్‌పై అవగాహన అవసరం



రావిపాడులో మాట్లాడుతున్న ఏఈ పద్దరాజు

పెంటపాడు: కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన సోలార్ విద్యుత్ పట్ల ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని విద్యుత్‌శాఖ ఏఈ పద్దరాజు పేర్కొన్నారు. గురువారం రావిపాడు గ్రామ సచివాలయం వద్ద సోలార్ విద్యుత్ వాడకంపట్ల రైతులకు, ప్రజలకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో కాజులూరి దుర్గా మల్లేశ్వరరావు, వంగూరి సుబ్బారావు, వంగూరి శివ, డెక్కపాటి వెంకటరమణ, అయితం శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

విశ్వనరుడు జాషువాకు నివాళి

తాడేపల్లిగూడెం (టీఓసీ): తెలుగు సాహితీ సమాఖ్య ఆధ్వర్యంలో గురువారం స్థానిక ధన రెసిడెన్సీలో జాషువా కవిత్వంపై తెలుగు పండితుడు పసుపులేటి రామచంద్రరావు చర్చించారు. విశ్వనరుడు జాషువాకు ఘన నివాళులు అర్పించారు. సభ కార్యక్రమంలో జ్యోతి ప్రజ్వలన పీటీ వెంకన్న గావించారు. సభాధ్యక్షుడిగా మండ బ్రహ్మాజీ, ప్రధాన కార్యదర్శి పైలు శ్రీనివాసరావు, పట్టణ ప్రముఖులు ఈతకోట తాతాజీ తదితరులు హాజరైయారు.

ఇక మద్యం పరవళ్లు

- ఏరులై పారనున్న లిక్కర్
- మద్యం షాపులకు నోటిఫికేషన్
- తణుకు సర్కిల్‌లో 33 షాపులు



తణుకులోని లిక్కర్ షాపులో మద్యం

తణుకు: ఇకపై మద్యం ఏరులై పారనుంది. తణుకు పట్టణంలోనే కాకుండా గ్రామాల్లో సైతం లిక్కర్ వరద ముంచెత్తనుంది. మరికొద్ది రోజుల్లో మద్యం వ్యాపారం మళ్లీ ప్రైవేటు మాఫియా కబంధ హస్తాల్లోకి వెళ్లిపోనుంది. 2019కు ముందు విధానాన్నే మళ్లీ కూటమి ప్రభుత్వం ప్రవేశపెట్టింది. కొత్త మద్యం పాలసీ ద్వారా ప్రభుత్వ మద్యం దుకాణాలను మూసివేసి లాటరీ విధానంలో ప్రైవేటు వ్యక్తులకు కట్టబెట్టే ప్రక్రియకు శ్రీకారం చుట్టింది. దీంతో గత అయిదేళ్లు లిక్కర్ వ్యాపారానికి దూరంగా ఉన్న సిండికేట్లు మళ్లీ జవసత్వాలు నింపుకొని బరిలోకి దిగారు. ఇదిలా ఉంటే.. ప్రభుత్వ నిర్వహణలో సాగుతున్న మద్యం దుకాణాల్లో పనిచేసిన సిబ్బంది ఇప్పుడు ఉపాధి కోల్పోనున్నారు. నాణ్యమైన మద్యాన్ని తగ్గింపు ధరలకు అందుబాటులోకి తీసుకువస్తామంటూ ప్రభుత్వం ఆశ చూపింది. ఇదిలా ఉంటే సర్కారుకు ఆదాయం సమకూర్చే వనరుల్లో ఎక్సైజ్ శాఖ అత్యంత కీలకంగా మారింది. అందుకు తగ్గట్టుగానే ప్రస్తుతం 33 షాపులను తణుకు సర్కిల్ పరిధిలో కేటాయించారు. దీంతోపాటు ఇప్పుడు మళ్లీ బెల్టు షాపులు పుట్టగొడుగుల్లా పుట్టుకొచ్చే అవకాశాలు పుష్కలంగా ఉన్నాయి.

షాపుల కోసం తీవ్ర పోటీ...

2019ముందు వరకు లిక్కర్ వ్యాపారాన్నే నమ్ముకుని ఉన్న వారిలో ఇప్పుడు మళ్లీ పునరుజ్జీవం కనిపిస్తోంది. అయిదేళ్లు వ్యాపారానికి దూరమైన సిండికేట్లు ఇప్పుడు మద్యం షాపులను చేజిక్కించుకోవడానికి తెరవెనుక ప్రయత్నాలు ప్రారంభించాయి. ఈసారి మద్యం దుకాణాలకు భారీగా దరఖాస్తులు వచ్చే అవకాశాలు ఉన్నట్లు ఎక్సైజ్ అధికారులు సైతం భావిస్తున్నారు. ఎంత ఎక్కువ మంది పోటీ పడి దరఖాస్తులు చేస్తే అంతటి స్థాయిలో నాన్ రిఫండబుల్ ఫీజు రూ.2 లక్షల రూపంలో ప్రభుత్వానికి ఆదాయం సమకూరనుంది. ఈనెల 9 వరకు దరఖాస్తులను స్వీకరించి 11న లాటరీ విధానంలో షాపులను కేటాయించేందుకు అధికారులు సన్నాహాలు చేస్తున్నారు. దరఖాస్తులను మూడు విధానాల్లో సమర్పించే అవకాశాలు ఉన్నాయని ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ శాఖ అధికారులు చెబుతున్నారు. తణుకు సర్కిల్ పరిధిలోని తణుకు పట్టణంతో పాటు తణుకు, ఇరగవరం, పెనుగొండ, పెనుమంట్ర మండలాల్లో ప్రస్తుతం 35 ప్రభుత్వ మద్యం దుకాణాలు కొనసాగుతున్నాయి.

అప్పుడే బెల్టు భయం

గత టీడీపీ హయాంలో బెల్టు షాపులు కోకొల్లలుగా ఉండేవి. వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాంలో బెల్టు షాపులను పూర్తిగా నియంత్రించారు. తాజాగా పాత విధానం అమల్లోకి వస్తుండడంతో మళ్లీ బెల్టుషాపులు పుట్టగొడుగుల్లా పుట్టుకొచ్చే అవకాశాలు పుష్కలంగా ఉన్నాయి. అప్పట్లో మద్యం విక్రయాల ద్వారా ప్రభుత్వ ఖజానా నింపుకోవడానికి టీడీపీ ప్రభుత్వం షాపులకు లక్ష్యాలను నిర్దేశించింది. ప్రతి నెలా గరిష్టంగా మద్యం సరుకును కొనుగోలు చేయాలని ఎక్సైజ్ అధికారుల ద్వారా ఒత్తిడి చేసేది. ఈ క్రమంలో మద్యం షాపుల నిర్వాహకులకు మూడు నుంచి అయిదు బెల్టు షాపుల నిర్వహణకు అనధికారికంగా అనుమతులిచ్చేవారు. దీంతో విచ్చలవిడిగా, బహిరంగంగా మద్యం విక్రయించినా అధికారులు పట్టించుకున్న సందర్భాలు ఉండేవి కాదు. ఈ బెల్టు షాపుల బరి తెగింపుపై అప్పట్లో మహిళా సంఘాలు పెద్ద ఎత్తున నిరసనలు తెలిపేవి. ప్రస్తుతం అదే స్థాయిలో మళ్లీ బెల్టు షాపులు పుట్టుకొచ్చే అవకాశాలు ఉన్నాయని ఇప్పటికే మహిళా సంఘాలు ఆందోళన బాట పట్టాయి.

పారిశుద్ధ్య పరిస్థితుల పరిశీలన



పారిశుద్ధ్య పరిస్థితులను పరిశీలిస్తున్న కమిషనర్ ఏసుబాబు

తాడేపల్లిగూడెం: పారిశుద్ధ్య పరిస్థితుల పరిశీలనలో భాగంగా మునిసిపల్ కమిషనర్ ఏసుబాబు బుధవారం పట్టణంలోని 14, 15, 16, 19 వార్డుల్లో పర్యటించారు. చేపల బజారు, మార్కెట్ ప్రాంతాల వ్యాపారులతో మాట్లాడారు. పారిశుద్ధ్య మెరుగుదలకు తీసుకోవాల్సిన చర్యలను వివరించారు.

తణుకు మునిసిపాలిటీకి అవార్డు

తణుకు అర్బన్: స్వచ్ఛతా హీ సేవ కార్యక్రమంలో తణుకు మునిసిపాలిటీ పరిధిలో నిర్వహించిన కార్యక్రమాలకు అవార్డు దక్కింది. గతనెల 24వ తేదీ నుంచి ఈనెల 2వ తేదీ వరకు నిర్వహించిన వివిధ కార్యక్రమాలతోపాటు 2కే రన్, పారిశుద్ధ్య కార్మికులకు మెడికల్ క్యాంపు వంటి కార్యక్రమాలతోపాటు పాఠశాలు, కళాశాలల్లో విద్యార్థులతో స్వచ్ఛత ప్రతిజ్ఞ చేయించడం వంటి అంశాలతో ముఖ్యమంత్రి చంద్రబాబు నుంచి అవార్డును గాంధీ జయంతి రోజున అందుకున్నట్టు మునిసిపల్ కమిషనర్ టి.రామ్‌కుమార్ తెలిపారు.

అధినేతను కలిసిన వైఎస్సార్ సీపీ నాయకులు



తాడేపల్లిలో వైఎస్సార్ సీపీ వ్యవస్థాపక అధ్యక్షుడు జగన్‌ను కలిసిన మాజీ మంత్రి కొట్టు సత్యనారాయణ, చిత్రంలో ఏఎంసీ మాజీ చైర్మన్ ముప్పిడి సంపత్‌కుమార్ తదితరులు

తాడేపల్లిగూడెం రూరల్: తాడేపల్లిగూడెం నియోజకవర్గానికి చెందిన మాజీ మంత్రి కొట్టు సత్యనారాయణతో పాటు నర్సాపురం పార్లమెంట్ నాయకురాలు గూడూరి ఉమాబాల, తాడేపల్లిగూడెం ఏఎంసీ మాజీ చైర్మన్ ముప్పిడి సంపత్‌కుమార్, పార్టీ మండల అధ్యక్షుడు జడ్డు హరిబాబులు తాడేపల్లి పార్టీ కార్యాలయం వద్ద జరిగిన జెడ్పీటీసీల సమావేశంలో పార్టీ వ్యవస్థాపక అధ్యక్షుడు జగన్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. పార్టీ క్షేత్ర స్థాయిలో బలోపేతానికి తీసుకోవాల్సిన చర్యలపై సమావేశంలో చర్చించినట్టు సంపత్‌కుమార్ గురువారం విలేకర్లకు తెలిపారు. వైస్ ఎంపీపీ సూర్పని రామకృష్ణ, ఏఎంసీ మాజీ డైరెక్టర్ గార్లపాటి వీరకుమార్, యూత్ అధ్యక్షుడు ములకాల రాంబాబు, యాతం బూరయ్య తదితరులు జగన్‌ను కలిసిన వారిలో ఉన్నారు.

వడ్డి రఘురాం నాయుడుకు అభినందనలు



రఘురాం నాయుడును అభినందిస్తున్న వైఎస్సార్ సీపీ నాయకులు

తాడేపల్లిగూడెం (టీఓసీ): వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు రాష్ట్ర రైతు విభాగం వర్కింగ్ ప్రెసిడెంట్‌గా నియమితులైన తాడేపల్లిగూడెంకు చెందిన వడ్డి రఘురాం నాయుడును గురువారం ఆయన ఇంటి వద్ద ఆ పార్టీ జిల్లా అధికార ప్రతినిధి కర్రి సుధాకర్ రెడ్డి, బూడి ప్రసాద్‌లు మర్యాదపూర్వకంగా కలిశారు. ఆయనకు పుష్పమాలతో సత్కరించి, అభినందించారు.

రఘురాం నాయుడును కలిసిన దానయ్య

తాడేపల్లిగూడెం రూరల్: వైఎస్సార్ సీపీ రైతు విభాగం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్‌గా నియమితులైన వడ్డి రఘురాం నాయుడును గురువారం ఆయన స్వగృహంలో నందమూరు గ్రామానికి చెందిన మాజీ సర్పంచ్ కోనేటి దానయ్య, ఇందుకూరి శ్రీనివాస్, సారిక సత్యనారాయణ, నాగ మోహన శివలు మర్యాదపూర్వకంగా కలిశారు.

శని, ఆదివారాల్లో ఆర్టీసీ బస్సుపాస్ కౌంటర్ మూసివేత

తాడేపల్లిగూడెం (టీఓసీ): ఏపీఎస్ ఆర్టీసీ బస్సు పాస్ కౌంటర్‌లో కంప్యూటర్ సాంకేతిక ఆధునికీకరణ పనులు చేపట్టిన నేపథ్యంలో ఈ నెల 5, 6 తేదీల్లో బస్సు పాస్ కౌంటర్ మూసివేయనున్నట్టు డిపో మేనేజర్ వైఎస్ఎన్ మూర్తి వెల్లడించారు. తిరిగి ఈ నెల 7వ తేదీన సోమవారం కౌంటర్ తెరవనున్నట్టు చెప్పారు. బస్సుపాస్‌లు, సీజన్ టికెట్ హోల్డర్స్ అందరూ సహకరించాలని డీఎం కోరారు.

5, 6 తేదీల్లో పాసుల జారీ నిలిపివేత

తణుకు అర్బన్: ఏపీఎస్ ఆర్టీసీ వెబ్‌సైట్ సాఫ్ట్‌వేర్ ఆధునికీకరణ నిమిత్తం ఈనెల 5, 6 తేదీల్లో బస్‌పాస్‌ల పంపిణీ నిలుపుదల చేస్తున్నట్లు తణుకు డిపో మేనేజరు సప్పా గిరిధర్‌కుమార్ తెలిపారు. ఆయా కౌంటర్ల వద్ద 7వ తేదీ నుంచి యథావిధిగా పాసులు జారీ చేస్తారని పేర్కొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

తాడేపల్లిగూడెం (టీఓసీ): పట్టణంలోని హౌసింగ్ బోర్డు, కడకట్ల కొండయ్య చెర్వు, పాతూరు సబ్ స్టేషన్ల పరిధిలో విద్యుత్ మరమ్మతుల నిమిత్తం శుక్రవారం ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తామని ఈఈ కె.నరసింహమూర్తి తెలిపారు. వన్‌టౌన్‌లోని అన్ని ఏరియాల్లో విద్యుత్‌సరఫరా ఉండదని పేర్కొన్నారు.

తణుకులో నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

తణుకు: తణుకు డీ1, డీ2, వేల్పూరు, అత్తిలి, కొమ్మర విద్యుత్ సబ్‌స్టేషన్ల పరిధిలోని లైన్లు మరమ్మతులు, నిర్వహణ నిమిత్తం శుక్రవారం ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తామని ఏడీఈ పి.శ్రీనివాస్ తెలిపా రు. తణుకులోని బ్యాంకు కాలనీ, సూర్యాలయం వీధి, సాయి ఆసుపత్రి ప్రాంతం, శివాలయం ప్రాంతం, సంతమార్కెట్ ప్రాంతం, జపాన్ కాలనీ, ఇరగవరం కాలనీతోపాటు తణుకు మండలంలోని బాలాజీ నగర్, రైల్వేస్టేషన్ రోడ్డు, శాలిపేట, విష్ణుప్రియ నగర్, వీరభద్రపురం, అత్తిలి మండల గ్రామాలకు విద్యుత్ సరఫరా ఉండదని పేర్కొన్నారు.

మాలల సింహగర్జనకు సన్నాహాలు



పాల్గొన్న మాలల జేఏసీ నాయకులు

తాడేపల్లిగూడెం (టీఓసీ): నవంబర్ నెలలో విజయవాడలో, డిసెంబర్‌లో హైదరాబాద్‌లో మాలల సింహ గర్జన సభల నిర్వహణకు సన్నాహాలు చేస్తున్నట్టు మాల మహానాడు జాతీయ అధ్యక్షుడు, మాల సంఘల జేఏసీ రాష్ట్ర గౌరవాధ్యక్షులు చీకటి మిల్లి మంగరాజు తెలిపారు. పట్టణంలో నిర్వహించిన సమావేశంలో మంగరాజు మాట్లాడుతూ ఎస్సీ, ఎస్టీ వర్గీకరణ ప్రయత్నాలను తిప్పికొట్టేందుకు ఈ సభలు ఏర్పాటుచేయనున్నట్టు చెప్పారు. రిజర్వేషన్లు తీసేందుకు కేంద్రంలోని మోదీ, అమిత్ షా, రాష్ట్రంలో చంద్రబాబు కుట్రలు చేస్తున్నారని విమర్శించారు. మాలల సింహగర్జన సభలను విజయవంతం చేయాలని ఆయన కోరారు. మాల సంఘాల నాయకులు బేతాళ శరత్‌బాబు, ప్రాన్సిస్ రాజు, కాంతారావు, జయరాజు, శ్యామ్, రవిదేవ, సత్యకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

18న ఐఎఫ్‌టీయూ రాష్ట్ర సదస్సు



ఐఎఫ్‌టీయూ స్థానిక శాఖ ఆధ్వర్యంలో కరపత్రం విడుదల చేసిన దాన వర ప్రసాద్ తదితరులు

తాడేపల్లిగూడెం (టీఓసీ): విజయవాడలో ఈ నెల 18న నిర్వహించే ఐఎఫ్‌టీయూ రాష్ట్ర సదస్సును విజయవంతం చేయాలని జిల్లా సహాయ కార్యదర్శి మామిడి దాన వర ప్రసాద్ విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు గురువారం పట్టణంలో ఐఎఫ్‌టీయూ పట్టణ శాఖ ఆధ్వర్యంలో రాష్ట్ర సదస్సు కరపత్రం విడుదల చేశారు. కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన లేబర్ కోడ్లు, మూడు నేర చట్టాలను రద్దు చేయాలని, కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్, స్కీం రంగాల కార్మికులను రెగ్యూలర్ చేయాలని, అన్ని రంగాల సమస్యలను పరిష్కరించాలని, రాష్ట్ర ప్రభుత్వం హామీ ఇచ్చిన సూపర్ సిక్స్ అమలు చేయాలని, నిత్యావసర వస్తువుల ధరలను తగ్గించాలని తదితర అంశాలపై సదస్సులో కార్యాచరణ ఉంటుందని వెల్లడించారు. కార్యక్రమంలో సత్యనారాయణ, వెంకటేశ్వరరావు, అనిల్ కుమార్, రమణ, గణపతి, రాంబాబు, కేశవరావు, శ్రీను, పండు, కొండ తదితరులు పాల్గొన్నారు.

ఆర్టీసీ సిబ్బందికి సత్కారం



ఆర్టీసీ సిబ్బందిని సత్కరించిన మానవత సంస్థ ప్రతినిధులు, డిపో మేనేజరు గిరిధర్‌కుమార్

తణుకు అర్బన్: స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమంలో ఆర్టీసీ డిపో ఉద్యోగులు, కార్మికులు చూపించిన చొరవ అభినందనీయమని మానవత జిల్లా శాంతి ర్యాలీ చైర్మన్ గమిని రాంబాబు అన్నారు. స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమంలో సేవలందించిన ఏపీఎస్ ఆర్టీసీ తణుకు డిపో సిబ్బంది 15 మందిని మానవత సంస్థ ఆధ్వర్యంలో సంస్థ అధ్యక్షురాలు కఠారి శారదాదేవి అధ్యక్షతన గురువారం సత్కరించి దుస్తులు, మిఠాయిలు అందజేశారు. ఈ సందర్భంగా డిపో మేనేజరు సప్పా గిరిధర్‌కుమార్ మాట్లాడు తూ మానవత సంస్థ చేస్తున్న సేవాకార్యక్రమాలు అజరామరమని అన్నారు. కార్యదర్శి బి.రామకాశి, కోశాధికారి అక్కిన కాశీవిశ్వనాథం, అక్కాపంతుల బాలాజీ, పాతూరి శివన్నారాయణ, పులమాల వీరభద్రం, కఠారి విశ్వనాథరాజు, ఆకెళ్ల సుబ్రహ్మణ్యం, డాక్టర్ దాట్ల సత్యనారాయణరాజు, బీవీఆర్‌కే ప్రసాద్, ఆర్టీసీ సిబ్బంది పాల్గొన్నారు.

సస్యరక్షణ చర్యలతో ఎండాకు తెగులు నివారణ

తాడేపల్లిగూడెం రూరల్: వరిలో ఎండాకు తెగులు నివారణకు సస్యరక్షణ చర్యలు చేపట్టాలని జిల్లా వ్యవసాయాధికారి జెడ్ వెంకటేశ్వరరావు అన్నారు. గురువారం మండలంలోని కృష్ణాయపాలెం గ్రామంలో నిర్వహించిన పొలం పిలుస్తోంది కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ఎండాకు తెగులు నివారణకు చేలో నీరు తొలగించి మూడు రోజుల తర్వాత కొత్త నీటితో నింపాలన్నారు. ఎకరాకు 12 కిలోల పొటాష్ ఎరువులు వేసుకోవాలని సూచించారు. తెగులు వ్యాప్తి చెందకుండా ప్లాంటామైసిన్ 100 గ్రాములు, కాపర్ హైడ్రాక్సైడ్ 400 గ్రాములు మందును 200 లీటర్ల నీటిలో కలిపి పిచికారీ చేయాలన్నారు. ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో రైతులకు ఇబ్బందులు లేకుండా చూస్తామన్నారు. ఏడీఏ పి.మురళీకృష్ణ మాట్లాడుతూ రైతులు భూసారం పెంపునకు పచ్చిరొట్ట ఎరువులు వేసుకోవాలన్నారు. మండల వ్యవసాయాధికారి ఆర్ఎస్ ప్రసాద్, కేవీకే శాస్త్రవేత్త చిరంజీవి, పశువైద్యాధికారి విజయ్‌కుమార్, ఉప సర్పంచ్ బేదపూడి వెంకటేశ్వరరావు, అగ్రికల్చర్ అసిస్టెంట్ రామాంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

జగన్మాతా నమో నమః

దసరా ఉత్సవాలు శ్రీకారం



ముత్యాలంబాపురం ముత్యాలమ్మ



బలుసులమ్మ ఆలయం



వీరంపాలెం బాలాత్రిపుర సుందరీ



కాగులంపాడులోని అమ్మవారి ఊరేగింపు



రజత కవచాలంకరణలో సర్వమంగళమ్మవారు



వాసవీ మాత



మండపాక యల్లారమ్మ

తాడేపల్లిగూడెం / తాడేపల్లిగూడెం (టీఓసీ) / తాడేపల్లిగూడెం రూరల్ /పెంటపాడు : జగన్మాతా.. నమో నమః నామ స్మరణతో సాంబ్రాణి దూపాలు, గుగ్గిలపు వాసనలు, జైజై దుర్గ.. జైజై దుర్గ స్మరణతో పునీతులవుతూ.. ఆలయాలు, కోవెలలో భక్తులు పరవశిస్తున్నారు. దేవీ శరన్నవరాత్రులు నియోజకవర్గంలో ప్రారంభమయ్యాయి. తొలి రోజు గురువారం గూడెం పట్టణ ఇలవేల్పు బలుసులమ్మను బాలాత్రిపుర సుందరీదేవిగా నాలుగు టన్నుల వివిధ రకాల పండ్లుతో అలంకరించారు. రాజేశ్వరి పండ్ల వర్తకసంఘం ఆధ్వర్యంలో బ్రహ్మానందరెడ్డి మార్కెట్‌లో, వార్పురోడ్డులో ధాన్యం వర్తక సంఘం, ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో అమ్మవార్లను బాలాత్రిపుర సుందరీ దేవిగా అలంకరించారు. వీరంపాలెంలోని బాలాత్రిపుర సుందరీ విశ్వేశ్వర పంచాయతన క్షేత్రంలో శ్రీబాలాత్రిపుర సుందరీ అమ్మవారు శైలపుత్రికగా, ముత్యాలంబపురంలో ముత్యాలమ్మవారు రజత కవచ ముత్యాలమ్మగా భక్తులకు దర్శనమిచ్చారు. పెంటపాడు మండలంలో పలువురు భక్తులు భవానీ మాలధరించారు. ప్రత్తిపాడు వైజంక్షన్‌లోని కనకదుర్గ ఆలయంలో ఉత్సవాలు ప్రారంభమయ్యాయి. శంకరమఠంలోని అమ్మవారికి రజత ఛత్రం దాతలు సమర్పణ చేశారు. రజత కవచాలంకృత అమ్మవారిగా సర్వమంగళమ్మవారు దర్శనమిచ్చారు. దర్శిపర్రు పార్వతి బ్రహ్మలింగేశ్వరస్వామి ఆలయంలోని కనకదుర్గమ్మవారిని ఉత్సవ సామగ్రితో ఊరేగించారు. ప్రత్తిపాడు కాగులంపాడు రోడ్డులోని స్వయంభుగా వెలసిన అమ్మవారిని గ్రామంలో ఊరేగించారు. పెంటపాడు పోలీస్‌స్టేషన్ వద్ద కాశీఅన్నపూర్ణ ఆలయం, మౌంజీపాడు, కె.పెంటపాడు బైరాగిమఠం, రావిపాడు, బెండల్లంక, మీనవిల్లూరు దేవీ సెంటర్, కొండేపాడు, బోడపాడు వైఎస్సార్ కాలనీ తదితర ప్రాంతాల్లో ఉత్సవాలు నిర్వహిస్తున్నారు.

తణుకు మండలంలో..

తణుకు టౌన్: దేవీ శరన్నవరాత్రి ఉత్సవాలు మండలంలోని ఘనంగా ప్రారంభమయ్యాయి. దువ్వ దానేశ్వరి, మండపాక యల్లారమ్మ స్వర్ణకవచ అలంకరణలో పూజలు అందుకున్నారు. వేల్పూరు ఈశ్వరమ్మ, తణుకు కన్యకా పరమేశ్వరి ఆలయాల్లో ప్రత్యేక పూజలు చేశారు. తొలి రోజు అధిక సంఖ్యలో భక్తులు అమ్మవార్లను దర్శించుకున్నారు.